




ఆంధ్రజ్యోతి







జూలూరుపాడు మండలం వినోభానగర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌కు పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల



పారుతున్న గోదావరి జలాలు

# నెరవేరిన జల స్వప్నం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక భగీరథ ప్రయత్నం ఫలించింది. గోదావరి జలాలను కృష్ణమ్మ బేసిన్‌కు తరలించి ఎన్నెస్పీ ఆయకట్టును స్థిరీకరించాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దశాబ్దాల నాటి కల నెరవేరింది. సీతారామ కాల్వ 100వ కిలోమీటరు నుంచి ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్‌కెనాల్)కు బుధవారం రాత్రి మంత్రి తుమ్మల గోదావరి జలాలను విడుదల చేశారు. దాంతో ఏన్కూరు లింక్‌కెనాల్ నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాలువలో సాగర్ జలాలతో గోదావరి నీళ్లు కలిసి ప్రయాణం మొదలు పెట్టాయి. గోదారమ్మ, కృష్ణా జలాల అనుసంధానానికి ఏన్కూరు లింక్‌కెనాల్ వేదికగా నిలిచింది. గోదావరి జలాలు 65 గంటలపాటు 108 కి.మీ దూరం ప్రయాణించి కృష్ణా బేసిన్ చేరాయి.

- ఎట్టకేలకు కృష్ణా-గోదావరి జలాల అనుసంధానం
- సీతారామ కాల్వల్లో 65 గంటలకు పైగా ప్రయాణించి కృష్ణా బేసిన్ చేరిన గోదావరి జలాలు
- ఏన్కూరు లింక్ కెనాల్‌కు నీరు విడుదల చేసిన మంత్రి తుమ్మల
- ఎన్నెస్పీ ఆయకట్టులో యాసంగి పంటలకు జీవం
- ఖమ్మం జిల్లా భూములకు సస్యశ్యామల వైభవం

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/జూలూరుపాడు/ఏన్కూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాల ఎత్తిపోతలను ఈనెల 3న ఉదయం 10 గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరునుంచి సీతారామ ప్రాజెక్టు మొదటి లిఫ్టు నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి 40కి.మీ. ప్రయాణించి ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద ఉన్న రెండో లిఫ్టువద్దకు చేరుకున్నాయి. అక్కడ ఉన్న సీతారామ రెండోలిఫ్టు నుంచి ఎత్తిపోసి కమలాపురం లిఫ్టునకు చేర్చారు. అక్కడ నుంచి 57కి.మీ ప్రయాణించి సీతారామ ప్రాజెక్టు కెనాల్ 100వ కిలోమీటర్ పాయింట్‌కు చేరుకున్నాయి. అక్కడ రాజీవ్‌కెనాల్ (ఏన్కూరు లింక్‌కెనాల్)కు అనుసంధానించడంతో ఆ కాల్వలో 8.6కి.మీ ప్రయాణించి సాగర్ ఎడమకాలువకు గోదావరి జలాలు చేరుకున్నాయి. సీతారామ కాల్వల్లో గోదావరి జలాల ప్రవాహాన్ని తిలకించేందుకు కాలువ పరిసర గ్రామాల్లోని చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు, ఏన్కూరు మండలాల ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చారు. గోదారమ్మకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

**మంత్రి తుమ్మలకు ఘనస్వాగతం**

సీతారామకాలువ నుంచి గోదావరి జలాలను ఏన్కూరు లింక్‌కెనాల్‌కు విడుదల చేసేందుకు వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు స్థానిక రైతులు ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుమ్మల కృషిని రైతులతో పాటు నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశంసించారు. ఎన్నో ఏళ్ల భగీరథ ప్రయత్నం ఫలించడంతో మంత్రి తుమ్మల కూడా గోదావరి జలాలను చూసి పులకరించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో 'సీతారామ'కు కళ**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన సీతారామ ఎత్తిపోతల పథకం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక (మిగతా 6వ పేజీలో)

**తెలంగాణ 'పట్టిసీమ' రాజీవ్ లింక్ కెనాల్**

ఏపీలో 'పట్టిసీమ' లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా బ్యారేజికి అనుసంధానం చేసినట్టుగా తెలంగాణలో ఏన్కూరు లింక్‌కెనాల్ గోదావరి, కృష్ణా జలాల అనుసంధానం చేసింది. రాజీవ్ లింక్‌కెనాల్ తెలంగాణ 'పట్టిసీమ'గా నిలిచింది. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా 1,500క్యూసెక్కుల నీటిని మొదటి ప్రయత్నంగా విడుదల చేయగా, బుధవారం రాత్రి జూలూరుపాడు మండలం వినోభానగర్‌కు గోదావరి జలాలు చేరుకుని అక్కడి నుంచి రాజీవ్‌లింక్‌కెనాల్ ద్వారా ఏన్కూరు సమీపంలోని సాగర్ ఎడమకాలవకు గోదావరి నీరు ప్రవహించి కృష్ణమ్మ వడికి చేరాయి.

సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను

# తరలించాం

- సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం
- రైతులు సహకరిస్తేనే ప్రాజెక్టుల్లో వేగం
- రెండు రాష్ట్రాల సమన్వయంతోనే కృష్ణా జలాల సమస్యకు పరిష్కారం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- రాజీవ్ లింక్‌కెనాల్ గోదావరి జలాల విడుదల



వినోభానగర్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం/జూలూరుపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతుల సహకారంతో భూసేకరణ సత్వరం జరిగినప్పుడే సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, అందరి సహకారం ఉంటేనే సాగునీరు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా గోదావరి జలాలను ఎన్నెస్పీ కాలువకు మళ్లించి కృష్ణా జలాలతో అనుసంధానం చేయవచ్చని చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని, అందువల్లనే రాజీవ్ లింక్ కెనాల్‌తో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అందించి సస్యశ్యామలం చేసే అవకాశం లభించిందన్నారు.

జూలూరుపాడు మండలం వినోభానగర్ వద్ద రూ.90కోట్లతో నిర్మించిన రాజీవ్ లింక్‌కెనాల్ నుంచి సీతారామ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలను మంత్రి తుమ్మల బుధవారం రాత్రి నీటిని విడుదల ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. ఖమ్మం జిల్లాలో సీతారామ ద్వారా గోదావరి జలాలను ప్రతీ ఎకరానికి పంపి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా దుమ్ముగూడెం ప్రాజెక్టు కింద రూపకల్పన చేసి సీతారామ కింద గోదావరి నీటిని ప్రాజెక్టుకు మళ్లించగలిగామని రాబోయే రెండుమూడేళ్లలో దశలవారీగా జిల్లాలో 10 లక్షల ఎకరాలకు నీరందిస్తామన్నారు. పినపాక, సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా, కొత్తగూడెం (మిగతా 6వ పేజీలో)

గోదావరి జలాలతో

## సస్యశ్యామలం

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ 6



ఖమ్మంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## ఇంటర్ పరీక్షలు షురూ

- తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 669 మంది.. భద్రాద్రిలో 493 గైర్హాజరు
- క్యూఆర్ కోడ్ పనిచేయక విద్యార్థుల ఇబ్బందులు
- పరీక్ష కేంద్రాల చిరునామా దొరక్క హైరానా
- నేడు సెకండియర్ విద్యార్థులకు పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు మొత్తం 18,701మంది ఉండగా.. 18,032మంది పరీక్షకు హాజరయ్యారు. 669మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 16,317మంది హాల్‌టికెట్లు పొందగా 15,845 మంది పరీక్షలకు హాజరయ్యారు. 472మంది (మిగతా 6వ పేజీలో)

## మీరు మా అతిథులు...



దివ్యాంగులకు భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ 7

- ఖమ్మం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఉచిత మధ్యాహ్న భోజనం
- లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాలో వినూత్న కార్యక్రమం
- కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులకు వరం



భద్రాచలంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

## తేల్చుకుందాం రండి...

- బడ్జెట్‌లో రాష్ట్రానికి మీరెంతిచ్చారో చెప్పండి..
- మా ప్రభుత్వం ఏం చేసిందో తేల్చుకునేందుకు సిద్ధం
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఎంపీ బలరాంనాయక్ సవాల్

6

## అలసిన వేళ ఏమి సేదము రామా!

- రామయ్య కల్యాణం వేళ భద్రాద్రిలో భక్తులు సేదదీరే చోటు ఏదీ..?
- ఏ మూలకూ సరిపోని చలువ పందిళ్లు
- గతేడాది భారీగా మిగిలిన నవమి టికెట్లు
- మహా పట్టాభిషేకంపై విస్తృత ప్రచారం చేయాలి
- శ్రీరామనవమి ఏర్పాట్లపై నేడు కలెక్టర్ సమీక్ష

భద్రాచలం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆరాధ్య దైవం భద్రాద్రి రామయ్య కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తులు సేద తీరేందుకు నిలువ నీడ లభిస్తుందా! ఎందుకంటే మార్చి నెలలోనే ఎండల తీవ్రత తారాస్థాయిలో ఉంది. ఈ క్రమంలో ఏప్రిల్ 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించే శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి వచ్చే భక్తులు సేద తీరేందుకు నీడ లభిస్తుందా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అధికార యంత్రాంగం 1.50 లక్షల చదరపు అడుగులతో చలువ పందిళ్ల నిర్మాణం చేపడుతున్నా.. అవి భక్తులకు ఏ మాత్రం సరిపోని పరిస్థితి.

వసతి సౌకర్యం అందరికి అందించే అవకాశం లేకపోవడంతో భక్తుల కష్టాలు వర్ణనాతీతమని చెప్పక తప్పదు. ఇదిలా ఉండగా గతేడాది శ్రీరామనవమికి నవమి టికెట్లు భారీగా మిగిలాయి. కల్యాణం టికెట్లు కొన్న భక్తులకు దర్శన భాగ్యం లభిస్తుందా? ఎందుకంటే సెక్టార్లు నిండిపోయాయంటూ పోలీసు అధికారులు భక్తులను సెక్టార్లలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న సందర్భాలు లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఈసారి నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణానికి చేపట్టే ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్‌వి పాటిల్ భద్రాచలంలోని సబ్‌కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమీక్షించనున్నారు. ఈ సమీక్ష సమావేశానికి వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో పాటు ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొననున్నారు.



చెట్ల కింద సేదతీరుతున్న భక్తులు(ఫైల్)

**సేద తీరేందుకు నిలువ నీడ కరువు.. ..**


భద్రాద్రిలో ఎండలు ఇప్పటికే తారాస్థాయికి చేరడంతో శ్రీరామనవమికి వచ్చే భక్తులకు నిలువ నీడ లభిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ ఏటా నీడ లభించక చెట్ల కిందే భక్తులు సేద తీరుతున్న పరిస్థితులు కనిపిస్తూనే ఉన్నాయి. ఎండలతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే తమకు భద్రాద్రిలో వసతి ఆశించినస్థాయిలో ఉండదని అంచనాకు భక్తులు వస్తున్నారు. వారికి అధికార యంత్రాంగం ఇస్తున్న తాత్కాలిక వసతి సరిపోవడం లేదు. ఈసారి మార్చి నెలలోనే ఎండలు మండుతుండటంతో ఏప్రిల్‌లో ఏవిధంగా ఉంటాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చల్లటి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు భక్తులకు భారీగా అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**భారీగా మిగిలిపోయిన నవమి టికెట్లు**

గతేడాది శ్రీరామనవమికి భారీగా కల్యాణం టికెట్లు మిగిలిపోయాయి. అలాగే గత నవమికి జిల్లాలోని ఓ కీలక అధికారి కార్యాలయానికి తీసుకున్న టికెట్ల ఆదాయ వివరాలు లేకపోవడంతో గతేడాది (మిగతా 6వ పేజీలో)

## ఆర్టీసీ ఇంద్ర బస్సు పల్టీ

- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు
- ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో ఘటన



గాయపడిన మహిళ



పల్టీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కొణిజర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు పల్టీ కొట్టిన ప్రమాదంలో పెద్దప్రమాదం తప్పింది. బుధవారం తెల్లవారుజామున 4.30 నిమిషాల సమయంలో హైదరాబాద్ నుంచి సత్తుపల్లి వస్తున్న ఇంద్ర ఏసీ ఆర్టీసీ బస్సు కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోకి రాగానే ఎదుటి వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో మొత్తం 12మంది ప్రయాణికులు ఉండగా వారిలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు, పోలీసులు, బస్సు డ్రైవర్ తెలిపినవివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి వస్తున్న ఇంద్ర ఏసీ ఆర్టీసీ బస్సు తనికెళ్ల సమీపంలో ఓ పెట్రోల్ బంక్ దగ్గరలోకి రాగానే ఎదుటి వాహనాన్ని తప్పించబోయి, అదే సమయంలో బంక్‌లో నుంచి ఓ వ్యక్తి రావడంతో ఆ వ్యక్తిని కూడా తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టి చెట్టును ఢీకొని ఆగింది. బస్సు ప్రయాణికులు ఎక్కేవైపు పల్టీ కొట్టడంతో ప్రయాణికులు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి ఆగి బస్సు అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. బస్సులో డ్రైవర్ అబ్బులు కాకుండా 12మంది ప్రయాణికులు ఉండగా.. వారిలో రాణి, వై. సత్య నారాయణ, వై.సత్యవతిలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు వెంట నే 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ఖమ్మం తరలించారు. డిపో సిబ్బంది కూడా వెంటనే వచ్చి క్రేన్ ద్వారా పల్టీ కొట్టిన బస్సు తీశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రయాణికులు పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.



రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

## రాష్ట్రపతి భవన్‌లో గిరిజన స్టాల్

**ఆదివాసీల ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యం**

భద్రాచలం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమల ద్వారా తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్‌ను ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో గిరిజన మహిళల ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసిన సమాచారం అందిన వెంటనే ఆయన మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వైవిధ్య సౌత్ ఆఫ్ ఇండియా నేపథ్యంలో భాగంగా (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి 'పది' విద్యార్థులకు

ఆకాశవాణిలో

# సబ్జెక్టుల వారీగా..



కొత్తగూడెం కేంద్రం స్టేషన్ ప్రోగ్రాం హెడ్ శ్రీనివాసన్

కొత్తగూడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 110.1 మెగావాట్స్‌పై 6వ తేదీ (గురువారం) నుంచి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం నిపుణులతో సబ్జెక్టు వారీగా పేపరు విశ్లేషణను ప్రారంభం చేస్తుందని ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం స్టేషన్ ప్రోగ్రాం హెడ్ శ్రీభైరి శ్రీనివాసన్ బుధవారం విలేకరుల తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రసారం చేస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా, ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం పరీక్షల్లో మెళకువలు తెలియపరుస్తూ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించడానికి సబ్జెక్టుల వారీగా పేపరు విశ్లేషణను ప్రారంభం చేస్తున్నామని తెలిపారు. పరీక్షల తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి ఆ రోజు సబ్జెక్టులకు సంబంధించి విశ్లేషకులకు పరిచయ కార్యక్రమాన్ని ప్రసారం చేయనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

**సబ్జెక్టు, ప్రసార సమయ వివరాలు**

6న తెలుగు ఉదయం 10 గంటలకు, 7న హిందీ, 10న అంగ్లం, 11న గణితం, 12 ఫిజికల్ సైన్స్, 13న బయోలాజికల్ సైన్స్, 15న సాంఘిక శాస్త్రం ప్రసారం అవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరారు.

# పగిడిద్దరాజు పెళ్లికొడుకాయెనే...

» అంగరంగ వైభవంగా జాతర ప్రారంభం

» నేడు సమ్మక్క రాకతో నిండు జాతర

గుండాల, మార్చి 5: వనం నుంచి పగిడిద్దరాజు రాకతో భక్తులు పారవశ్యంతో తరించారు. శివసత్తుల పూనకాలు, గిరిజన నృత్యాలతో పెళ్లికొడుకుగా ముస్తాబైన పగిడిద్దరాజును గద్దెలపైకి తీసుకువచ్చారు. మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు జాతర ఆదివాసీ సంప్రదాయలతో బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క- సారక్క జాతర నిర్వహిస్తారు. కాగా సమ్మక్క భర్త పగిడిద్దరాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండలం, యాపలగడ్డ



గద్దెల వద్ద గిరిజనుల నృత్యం

గ్రామానికి చెందిన అరెం వంశీయుల ఇలవేల్పు. సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరకు అరెం వంశానికి చెందిన పగిడిద్దరాజును వేపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయులు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఇక్కడి నుంచి పగడిద్దరాజు మేడారం చేరుకుంటేనే మేడారంలో జాతరకు ప్రారంభమవుతుంది. మేడారం జాతర అనంతరం 16వ రోజు యాపలగడ్డ గ్రామంలోని మల్లన్న వాగు సమీపంలో సమ్మక్క-పగిడిద్దరాజుల నాగవెల్లి జాతర అరెం వంశీయులు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. బుధవారం సాయంత్రం గ్రామానికి చెందిన పూజారులు, వడ్డెలు అప్పయ్య, లక్ష్మినర్సు, గ్రామస్తులు పగిడిద్దరాజును బర్ల గుట్ట నుంచి వేపలగడ్డలోని గుడికి తీసుకురాగా, గర్భగుడిలోని పగిడిద్దరాజు ఆభరణాలు, శివసత్తులు, ఈటలు, బల్లెం, పురా



గద్దెపైకి పగిడిద్దరాజును తీసుకొస్తున్న గిరిజనులు

తన కాలం నాటి ఆభరణాలు, పడగలకు (జెండాలు) ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడిద్దరాజును గిరిజన నృత్యాలతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుతో గద్దెలపైకి తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. రాత్రి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహిస్తారు. నేడు వనదేవత సమ్మక్కను మాడిమోరి గుట్ట నుంచి గుడికి తీసుకురావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది. దేవతలకు గంగాస్నానం నిర్వహించి తెల్లవారుజామున నాగవెల్లి నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే జాతరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ములుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ లచ్చుపటేల్, జాతర కమిటీ సభ్యులు కాంతారావు, చిన్న కాంతారావు, లక్ష్మయ్య, సమ్మయ్య, సత్యం, భిక్షం జాతర ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

తైక్వాండోలో మెరిసిన

# భద్రాద్రి క్రీడాకారులు

19 మందిని వరించిన పతకాలు



తైక్వాండోలో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు

చుంచుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడల్లో భద్రాద్రి జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మెరిశారు. ఇటీవల హైదారాబాద్ యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ముగిసిన 13వ తైక్వాండో ఓపెన్ స్టేట్ లెవల్ ఇంటర్ స్కూల్స్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో జిల్లాకు చెందిన 26మంది ప్రాతినిధ్యం వహించగా 19 మందికి పతకాలు వరించాయి. సబ్ జూనియర్ విభాగంలో దూలం భవనిత్, ఎస్.నిహాస్విక, టి.గాయత్రి, పి.జయప్రశాంత్‌పాల్, కె.జానకీరామ్, కె.ధృవకృష్ణ ఆరుగురు, జూనియర్ విభాగంలో ఈశ్వర్, ఎస్‌కె.మినహాస్ ముజామిల్ టి.శుభశ్రీ, బి.వర్షిత్‌నందన్, ఎస్‌కె.సాహెల్, డి.సాయినిహాల్, ఎస్‌డి.అబ్దుల్ వహీద్, పి.జయప్రకాశ్‌పాల్, సిహెచ్.రేణుహాసిని, సిహెచ్.పూర్ణశ్రీ, గణేష్, వి.జీవశ్రీ, వి.శ్రీహర్ష పదమూడు మంది పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ ఏ.ప్రవీణ్ కుమార్, భద్రాద్రి జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ యండి సెమీయుద్దీన్, సెక్రటరీ లకినేపల్లి రమేష్‌కుమార్, కోచ్‌లు ఎస్‌కె.యాకుబ్‌పాషా,రమేష్‌కుమార్, ఆర్గనైజర్ సెక్రటరీ రవికిరణ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

పారిశుధ్య కార్మికురాలి

# ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రికి తరలించిన అధికారులు



చికిత్స పొందుతున్న మాధవి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహించే మాధవి గుర్తుతెలియని టాబ్లెట్లను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పారిశుధ్య కార్మికురాలిగా విధుల్లో చేరిన మాధవి కొంతకాలంగా కార్పొరేషన్ కార్యాలయంలో ఓ విభాగంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తుంది. అయితే ఇటీవల రెండువర్గాలకు జరిగిన గొడవలో ఎవరి విధులకు వారు వెళ్లాలని కమిషనర్ ఆదేశాలు జారీచేసినా.. మాధవి విధులకు వెళ్లకుండా కార్పొరేషన్ కార్యాలయంలోనే విధులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ మాధవిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈనేపథ్యంలో బుధవారం బయట ఎక్కడో గుర్తుతెలియని చోట టాబ్లెట్లు మింగి కార్యాలయానికి వచ్చి లోపల కిందపడిపోయింది. అది గమనించిన అధికారులు అంబులెన్సుకు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అధికారులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు.

మాదిగ ఉపకులాలకు

# 11శాతం రిజర్వేషన్ కల్పించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అందించిన నివేదిక తప్పుల తడకలుగా ఉన్నాయని, తక్షణమే సవరణలు చేసి మాదిగ ఉపకులాలకు 11శాతం రిజర్వేషన్ ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ), ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు, ఖమ్మంజిల్లా అధ్యక్షుడు తూరగుంటి అంజయ్య మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల డప్పు ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ గ్రూపులుగా కాకుండా ఏబీసీడీలుగా వర్గీకరించి జనాభా దామాషాప్రకారం మాదిగ ఉపకులాలతో 58కులాలకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మాదిగ కులంలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారికి కేబినేట్‌లో తక్షణమే రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమలో నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, కూరపాటి సునీల్‌మాదిగ, కొలికపోగు వెంకటేశ్వర్లు, పగిడికత్తుల ఈదయ్య, బాకి శ్రీను, నాగభూషణం, రాజేష్ పాల్గొన్నారు.

రేపు భద్రాద్రి

## జిల్లాస్థాయి జాబ్ మేళా

జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాస్థాయి జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి కల్పించే ఉద్దేశంలో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో అపోలో ఫార్మసీ ఏర్పాటులో భాగంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఫార్మసిస్ట్, ట్రైనింగ్ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసిస్టెంట్ కేటగిరీలలో మొత్తం 50 పోస్టుల భర్తీ చేయనున్నట్టు తెలిపారు. 10వ తరగతి నుంచి ఎం.ఫార్మసీ వరకు విద్యార్హత కలిగి ఉండాలని, 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ముఖాముఖికి తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు.

# 'శ్రీవారి'కి జలాదివాసం



జలాదివాసం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో తుళ్లూరు వ్యవసాయ క్షేత్రంలో తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు శాంతి కల్యాణం నిర్వహించనున్న శ్రీవారి పంచలోహ ఉత్సవమూర్తులకు యాగశాలలో బుధవారం జలాదివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గంగా, యమునా, కృష్ణా, గోదావరి మొదలైన పవిత్ర జలాలతో, పవమాన సూక్తములతో వైభవోపేతంగా జలాదివాసం నిర్వహించారు. ప్రాతఃకాల అర్చనల అనంతరం మండపారాధనలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సమయంలో గ్రామస్థులు ఉత్సవమూర్తులు జలబిందెలతో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుళ్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం నూతనంగా ప్రారంభించడానికి సిద్ధమవుతున్న వకుళామాత స్టేడియంలో శ్రీవారి శాంతికల్యాణానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, రుత్వికులు, అర్చకులు పాల్గొన్నారు

# సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించాం

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు వచ్చే ఏడాదిలోగా సీతారామ నుంచి అన్ని చెరువులకు నీరందిస్తామని రైతులు కూడా గోదావరి జలాలతో పంటలు పండించుకుని అభివృద్ధి చెందాలన్నారు. నాడు తాలిపేరు ప్రాజెక్టుతోపాటు బేతుపల్లి వంటి ప్రాజెక్టులను పూర్తిచేసి ఖమ్మంజిల్లాలో రైతాంగానికి నీరందించానని తెలిపారు. రాజీవ్‌కెనాల్‌కు రైతులు నాపై ఉన్న నమ్మకంతో భూములు ఇవ్వడం ద్వారానే గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు అందించామని తెలిపారు.

త్వరలో కొత్తగూడేనికి ఎయిర్‌పోర్టు మంజూరు కాబోతుందని, ఇందుకు కృషి జరుగుతుందని, అలాగే జగ్గయ్యపేట నుంచి కొత్తగూడేనికి జాతీయరహదారి, భద్రాచలం నుంచి ఏటూరునాగారానికి, కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపుగా హైదరాబాద్‌కు జాతీయ రహదారులు రాబోతున్నాయని, తెలిపారు. భద్రాచలం -పాండురంగాపురం మీదుగా ఒడిశాకు రైల్వేలైన్ రాబోతుందని, రాబోయే నాలుగేళ్లలో ఖమ్మం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

కృష్ణా జలాల నీటి వినియోగంలో తెలంగాణకు తక్కువ కేటాయింపులు జరిగాయని, కర్ణాటక, ఏపీలకు కృష్ణా జలాల వినియోగం అధికంగా ఉందని, తెలంగాణ ఎత్తు ప్రాంతంలో ఉండడంతో నీటి వినియోగ అవకాశం తక్కువగా ఉందని, గోదావరి జలాలతోనే కృష్ణా ఆయకట్టును కూడా అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. భూములు ఇచ్చిన రైతులను ఈ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, తెలిపారు.

సభలో ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్‌లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వీపాటిల్ మాట్లాడుతూ రైతులు పామాయిల్ సాగుకు ముందుకు రావాలని గోదావరి జలాలను సాగునీటికి మళ్లించే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్లు, మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్, రైతుసంఘం నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు ప్రసంగిస్తూ సీతారామ ఖమ్మం జిల్లాకు వరప్రసాదమని, ఈ గోదావరి జలాలతో జిల్లా రైతాంగం మరింతగా పంటలు పండించి అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సీతారామ కాలువకు అనుసంధానంగా ఉన్న ఏన్కూరు లింక్‌కెనాల్ నుంచి పూజలు నిర్వహించి గోదావరి జలాలను విడుదల చేశారు. కాలువలో పారుతున్న జలాలపై పూలు చల్లి, చీర సమర్పించారు.

# ఇంటర్ పరీక్షలు షురూ

(5వ పేజీ తరువాయి)

గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,384 మంది ఉండగా 2,184 మంది పరీక్షలకు హాజరు కాగా 197 మంది గైర్హాజరైనట్టు ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. 9గంటల 5 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. కొందరు విద్యార్థులు పరీక్షా కేంద్రాల అడ్రస్ తెలియక ఇబ్బందులు పడ్డారు. పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు అబ్జర్వర్స్ కె.విశ్వేశ్వరరావు, సీహెచ్.యాదగిరి పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 39 పరీక్షా కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఐఈవో తెలిపారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో నాలుగు నుంచి ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నడుమ ప్రశ్నపత్రాల సీల్ ఓపెన్ చేసినట్టు డీఐఈవో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సహాయం కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 9948904023 ఏర్పాటు చేశారు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..**

భద్రాద్రి జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు మొత్తం 9,939 మంది ఉండగా తొలిరోజు పరీక్షలకు 9,446 మంది హాజరయ్యారు. 493 మంది గైర్హాజరైనట్టు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ బృందం, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌లు పర్యవేక్షించారు. గురువారం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

**పనిచేయని క్యూఆర్ కోడ్**

ఇదిలా ఉండగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు నూతనంగా హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. కానీ చాలామంది విద్యార్థులు తమకు క్యూఆర్ కోడ్ స్కాన్ కాలేదని, ఎన్నిసార్లు ప్రయత్నించినా.. ఎర్రర్ వచ్చిందని వాపోయారు. ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య పరీక్షా కేంద్రాన్ని హాల్‌టికెట్‌లో ఖానాపురంహవేలి మినీ ట్యాంక్‌బండ్ ఖమ్మం అని ముద్రించారు. వాస్తవానికి శ్రీచైతన్య జూనియర్ కళాశాల బల్లేపల్లి పరిధిలో ఇల్లెందు రోడ్డులో ఏర్పాటు చేశారు. కానీ బోర్డు అధికారులు, కళాశాల యాజమాన్యం అడ్రస్‌ను ఖానాపురంహవేలి ఖమ్మం అని ముద్రించటంతో ఎక్కువ మంది విద్యార్థులు, వారి తల్లితండ్రులు మమతా రోడ్డులోని శ్రీచైతన్య పరీక్షా కేంద్రానికి వెళ్లారు. అక్కడ విద్యార్థుల హాల్‌టికెట్ నెంబర్లు కనిపించకపోవటంతో అధికారులను అడిగి తిరిగి ఇల్లెందు రోడ్డులోని బల్లేపల్లి పరీక్షా కేంద్రానికి చివరి నిమిషంలో చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఖమ్మం నగరంలోని పలు పరీక్ష కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

## గోదావరి జలాలతో సస్యశ్యామలం

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి, ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరానికి గోదావరి జలాలను అందించి సస్యశ్యామలం చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బధవారం ఆయన జూలూరుపాడు మండలంలోని వినోబానగర్ గ్రామం వద్ద నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్‌ను పరిశీలించారు. గుండెపుడి, రామచంద్రాపురం, నల్లబండబోడు గ్రామాలను ఆయన సందర్శించారు. గోదావరి జలాలు జూలూరుపాడు మండలానికి చేరుకోవటంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. గోదావరి జలాల రాకతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలిగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, నాయకులు మోదుగు రామకృష్ణ, గోపు రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన జల స్వప్నం

(5వ పేజీ తరువాయి)

మంత్రి తుమ్మల చొరవతో తిరిగి పట్టాలెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సీతారామ ప్రాజెక్టు సమస్యను తీసుకెళ్లి రూ.90కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు పూర్తిచేసి గత ఆగస్టు 15న సీఎం రేవంతరెడ్డి చేతులమీదుగా సీతారామ ఎత్తిపోతల లిఫ్టును ప్రారంభించారు. ప్రస్తుతం వేసవి రావడం, మరోవైపు సాగర్ జలాలు తగ్గడంతో గోదావరి నీటికి ఆవశ్యకత ఏర్పడడంతో సీతారామ లిఫ్టు ద్వారా నీటిని విడుదల చేశారు. గోదావరి జలాల రాకతో ఖమ్మం జిల్లాలోని సాగర్ ఎడమ కాలువ పరిధిలోని వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.

## రాష్ట్రపతి భవన్‌లో గిరిజన స్టాల్

(5వ పేజీ తరువాయి)

మినిస్టర్ ఆఫ్ స్టేట్ గవర్నమెంటు (మోటా) సహకారంతో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీ గిరిజన మహిళ ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాలు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు, ప్రజలకు తెలియజేసి ప్రాచుర్యంలోకి తేవడం కోసం ఐటీడీఏ ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించిన సిబ్బంది తయారు చేస్తున్న ఉత్పత్తులతోపాటు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రమాదేవి, క్రాంతి పాల్గొన్నారు.

# అలసిన వేళ ఏమి సేదము రామా!

(5వ పేజీ తరువాయి)

అధికారికంగా నవమి ఆదాయ వివరాలు సైతం దేవస్థానం అధికారులు ప్రకటించలేదు. రామయ్య కల్యాణం తిలకించేందుకు 15,860 టికెట్లు విక్రయించాలని దేవస్థానం అధికారులు భావించగా అందులో ఎన్ని టికెట్లు విక్రయించారనే దానిపై వివరాలు కల్యాణమైన పక్షం రోజులైనా.. వివరించలేదని 'ఆంధ్రజ్యోతి'లో పక్షం రోజులైనా.. లెక్కలేవి కథనం వెలువడింది.

**మహా పట్టాభిషేకానికి విస్తృత ప్రచారం చేయాలి**

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకానికి దేవస్థానం అధికారులతోపాటు జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేయాలని రామ భక్తులు కోరుతున్నారు. శ్రీరామనవమి నాడు కల్యాణం తిలకించేందుకు భారీగా భక్తులు తరలివస్తుండగా మహాపట్టాభిషేకానికి ఆశించినస్థాయిలో భక్తులు లేకపోవడం లోటుగా ఉంటోందని వారు వాపోతున్నారు. ప్రణాళికబద్ధంగా ఇప్పటి నుంచే ప్రచారాన్ని నిర్వహిస్తే భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని రామ భక్తులు సూచిస్తున్నారు.

# తేల్చుకుందాం రండి...

భద్రాచలం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు శూన్యమని బడ్జెట్‌లో రాష్ట్రానికి మీరెంతిచ్చారో... మా ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో తేల్చుకునేందుకు మీరు సిద్ధమా అంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏ సెంటర్‌లో అయినా తేల్చుకునేందుకు తాము సిద్ధమంటూ ఆయన స్పష్టం చేశారు. భద్రాచలంలో బుధవారం రామయ్యను దర్శించిన అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే ఉద్దేశ్యంతోనే అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రూ.25 వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని స్పష్టం చేశారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ఏం హక్కుందని కవిత మహబూబాబాద్ వచ్చి మాట్లాడారని ఆయన నిలదీశారు. గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఆ అప్పులను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని అన్నారు. అంతకు ముందు రామయ్య దర్శనానికి వచ్చిన ఎంపీ బలరాంనాయక్‌కు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

● నర్సంపేటలో పరీక్ష రాసేందుకు వచ్చి దుర్మరణం



సిద్దు ఫైల్

ఖమ్మం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నర్సంపేటలో పరీక్ష రాసేందుకు హైదరాబాదు నుంచి ఖమ్మానికి తన స్నేహితుడితో ఖమ్మం వచ్చి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన బుధవార తెల్లవారుజామున ఖమ్మం నగర పరిధిలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నర్సంపేట సమీపంలోని చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన నంగనూరి రమేష్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులోని కొండాపూర్‌లో నివాసముంటూ ఓ డెలివరీ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. తన పెద్ద కుమారుడు నంగునూరు సిద్దు(17) ఇంటర్‌లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో అదే డెలివరీసంస్థలో పనిచేస్తూ పరీక్షల కోసం చదువుతున్నాడు. హైదరాబాదులోని కొండాపూర్‌లో ఉండే ఖమ్మానికి చెందిన సంతోష్ అనే యువకుడు కొంతకాలంగా పరిచయం కాగా తనతో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాదు నుంచి ఖమ్మం కు సంతోష్‌తో కలిసి మంగళవారం సాయం త్రం వచ్చాడు. నర్సంపేటలో గురువారం పరీక్ష ఉండటంతో పరీక్ష రాసేందుకు వెళ్లాలి అనుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రిలో సంతోష్ అతని స్నేహితుడు ప్రదీప్‌తో కలిసి ఫూటుగా మద్యం సేవించారు. బుధవారం తెల్లవారుజాము సమయంలో కరుణగిరి వైపు వెళుతుండగా నగర శివారులోని రాపర్తినగర్ ఫ్లైఓవర్ దాటగానే మున్నేరు ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొని కిందపడ్డారు. ఈ క్రమంలో సిద్దు అక్కడికక్కడే మృతిచెందగా ప్రదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన స్థానికులు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిని వివరాలు బుధవారం సాయంత్రం వరకు ఎవరికీ తెలియలేదు. మృతుని ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించటంతో బుధవారం రాత్రికి మృతుని కుటుంబ సభ్యులు ఖమ్మం చే రుకున్నారు. మృతిపై తమకు అనుమానం ఉన్నట్లు మృతుని కు టుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇంకా ఫిర్యాదు అందలేదని సమాచారం మాత్రమే వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## 9న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్‌మార్చి5(ఆంధ్రజ్యోతి): ఈనెల9న ఖమ్మం సర్వజ్ఞ పాఠశాలలో అండర్-10, 13, 16 బాలురు, బాలికల విభాగాలలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, టోర్నీఆర్గనైజర్ సీహెచ్. గోపీక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు స్విస్‌లీగ్ పద్ధతిలోఉంటాయని, క్రీడాకారులు సొంత చెస్ కిట్‌తో ఉదయం 8 గంటల కల్లా పాఠశాలకు చేరుకోవాలని కోరారు. ఎంట్రీలు, ఇతర సమాచారం కోసం 8309134971 నెంబరును సంప్రదించాలని కోరారు.

## పారా బ్యాడ్మింటన్‌లో గోల్డ్‌మెడల్




ఖమ్మంస్పోర్ట్స్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని నిర్మల్‌హృదయ్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఎస్‌కె.అస్మారూహి 7వ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్(ఎస్‌ఎయూ5)లో ప్రతిభచాటింది. ప్రథమస్థానం పొంది గోల్డ్‌మెడల్ సాధించినట్లు, పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివరెడ్డి తెలిపారు. విద్యార్థిని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ వంగా సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎ.పద్మజ, వి.శ్రావణి, ఉపాధ్యాయులు అస్మారూహిని అభినందించారు.

## పాఠశాల సామగ్రికి టెండర్ల ఆహ్వానం

భద్రాచలం,మార్చి5(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలకు, వసతి గృహాలకు కావలసిన డ్యూయల్ డెస్క్ బల్లలు, గ్రీన్ బోర్డు, స్టీల్ వంటి సామగ్రి సరఫరాకు సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. టెండరుదారు పాన్‌కార్డు, టిన్ కార్డు నెంబర్లు, బ్యాంకుఖాతా, అన్ని అర్హతలు కలిగిన తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈనెల పదో తేదీలోపు షెడల్‌ను పొందవచ్చని పూర్తి వివరాలకు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఆర్చరీ పోటీలకు భద్రాద్రి విద్యార్థులు

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్, మార్చి5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు భద్రాద్రి జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఐడీఓసీలో అభినందించారు. ఈనెల 21న గుంటూరులో జరిగే ఆర్చరీ జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించి పతకం సాధించాలని కాంక్షించారు.

## 'వికసిత్ భారత్' మాక్ పోలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యువ పార్లమెంట్ మాక్ పోలింగ్ పోటీల్లో పాల్గొనే యువత ఈనెల 9కల్లా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యూత్ అధికారి ప్రవీణ్, నోడల్ ఆఫీసర్ భానుచందర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి శ్రీనివాసరావు, కేఎండీసీ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాలలోపు యువత మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.ని త్వరలోనే కేఎండీసీ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల యువత మయ భారత్ పోర్టల్‌లో మెగా ఈవెంట్స్‌ని క్లిక్ చేయడం ద్వారా నమోదు జరుగుతుందని, వికసిత్ భారత్ గురించి తాము ఏమనుకుంటున్నారో అనే అంశంపై ఒక నిమిషం నిడివి గల వీడియో తీసి ఆయా రిజిస్టర్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 8790601617,9666409997నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# దివ్యాంగులకు ఉచిత భోజనం

- ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాష్ట్రంలోనే తొలిసారిగా వినూత్న కార్యక్రమం
- సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డుతో టోకెన్


దివ్యాంగులకు భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,మార్చి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఖమ్మం కలెక్టర్ దివ్యాంగులకు ఉచితంగా భోజనాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమాన్ని బుధవారం ఆయన లాంఛనంగా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్డీవో సన్యాసయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 40 రోజుల క్రితం ప్రజావాణిలో వచ్చిన అభ్యర్థన మేరకు అధికారులతో చర్చించి దివ్యాంగ అర్జీదారులకు ఉచితమధ్యాహ్న భోజనం కల్పించాలని నిర్ణయానికి వచ్చామని అన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులకు ఇది వారి కలెక్టరేట్ అనే భావన కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కలెక్టరేట్‌కు వివిధ పనుల కోసం వచ్చే దివ్యాంగులు అంతా మాఅతిథులు అని మీకు ఏలాంటి పని చేసి పెట్టడానికైనా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు.ముఖ్యంగా సమాజంలో వెనుకబడిన వారికి, దివ్యాంగులకి, బలహీన వర్గాల వారికి సహాయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజావాణి కార్యక్రమం, వివిధ పనులపై ఎప్పుడు కలెక్టరేట్‌కు దివ్యాంగులు వచ్చిన క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజనాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే మూడునెలల్లో ప్రతి దివ్యాంగుడికి తప్పనిసరిగా యూడీఐడీ కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌లో సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డుతో టోకెన్ పొందిన వారికి ఈ భోజన వసతి కల్పిస్తామన్నారు. ఖమ్మం కలెక్టరేట్ ఖమ్మం నగరానికి కొంతదూరంలో ఉన్న నేపథ్యంలో దివ్యాంగులకు ఇబ్బందులు కలగవద్దని ఈ ఏర్పాటు చేశామని, నాణ్యమైన భోజనాన్ని క్యాంటీన్ ద్వారా అందిస్తున్నామని, ఒక భోజనంపై రూ.80 ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## స్థానిక ఎంపీగా మాట ఇస్తున్నా..
# రామయ్య లాంఛనాలు ఇప్పిస్తా

- పోరిక బలరాంనాయక్


పనులు పరిశీలిస్తున్న ఎంపీ

భద్రాచలం,మార్చి5(ఆంధ్రజ్యోతి):రామయ్య కల్యాణానికి ఈసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బులు ఇప్పిస్తానని స్థానిక ఎంపీగా మాట ఇస్తున్నానని పోరిక బలరాంనాయక్ అభయమిచ్చారు. తానీషా కాలం నుంచి భద్రాద్రి రామయ్య కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పణకు జీవోల జారీ చేస్తున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో బుధవారం రామయ్యను దర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రభుత్వ లాంఛనాలపైనా నిర్లక్ష్యమేనా అనే కథనం సైతం వెలువడింది. ఈ విషయాన్ని ఎంపీ వద్ద ప్రస్తావించగా... తానీషా సంప్రదాయాన్ని తాము తప్పక కొనసాగిస్తామని ఈసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తెచ్చే సమయంలో ఇందుకు అయ్యే లాంఛనాలను ప్రభుత్వమే చెల్లించేలా చూస్తానని బలరాంనాయక్ స్పష్టం చేశారు. స్థానిక ఎంపీగా తాను ఈ మాట ఇస్తున్నానని అన్నారు. ఇదిలా ఉండగా ప్రసాద్ పథకం కింద చేపడుతున్న పనులు వేగంగా సాగాలని సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. ముఖ్యంగా మిథిలా స్టేడియంలో చేపడుతున్న షెడ్లనిర్మాణం నిర్దీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల తీరును స్వయంగా పరిశీలించారు.

## ఒకరు పరీక్ష విధులకు.. మరొకరు సెలవు

**ఉపాధ్యాయులు రాక గేటు పోలంపల్లిలో విద్యార్థుల ఎదురు చూపు**



కారేపల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటు పోలంపల్లి ప్రాథమిక ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు సమయం పాటించకపోవడంతో చిన్నారులు ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇదే పాఠశాలలో మొత్తం 30 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే వీరు సమయానికి పాఠశాలకు రావటం లేదు. ప్రధానంగా ఉపాధ్యాయుల మధ్య వర్గపోరుఉండటం, మండల విద్యాశాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో గేటు పోలంపల్లి పాఠశాలతో పాటు మండల పరిధిలోని అనేక పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈపాఠశాల నిర్వహణ విషయంపై ఎంఈవో జయరాజ్‌ను వివరణ కోరగా పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని.. వారిలో ఒకరికి ఇంటర్ పరీక్షలకు డ్యూటీపై వెళ్లారని, మరో ఉపాధ్యాయురాలు సెలవు పెట్టినట్టు తెలిపారు.

## నా నౌకరీ నాకు ఇప్పించండి

**మణుగూరులో మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుడి భిక్షాటన**



మణుగూరుటౌన్,మార్చి5(ఆంధ్రజ్యోతి): నానౌకరినాకు ఇప్పించండి అంటూ మణుగూరు మునిసిపాలిటీలో పనిచేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బుధవారం వినూత్న రీతిలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టాడు. పట్టణంలోని పూల మార్కెట్ ఏరియాలో ఉద్యోగం లేకపోతే తన కుటుంబం వీధి పాలు అవుతుందని రావుల కుమార స్వామి రోదించాడు. 2014 నుంచి మణుగూరు మునిసిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహించేవాడు. రెండేళ్లక్రితంలో రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగటంతో విధులకు దూరమయ్యాడు. కోలుకున్న తర్వాత విధులకు హాజరయ్యేందుకు ప్రయత్నించగా నాటి అధికారులు నిరాకరించారు. దివ్యాంగుడైన తనకు మరలా మునిసిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. విధుల్లోకి తీసుకోవాలని ఆయన ఉద్యోగులకు సూచించారన్నారు. కలెక్టర్ ఆదేశాలు కూడా ఖాతరు చేయకుండా కనికరం చూపలేదని ఆవేదన, స్థానిక కార్యాలయ సిబ్బంది కూడా అవహేళ చేస్తూ ఇబ్బందులు పెట్టారని వాపోయాడు. తనకు ఇప్పటికైనా ఉద్యోగాన్ని కల్పించాలని భిక్షటన చేస్తూ కోరుతున్నానని తెలిపారు.

## అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల ఆరా

దమ్మపేట, మార్చి5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూసుకుంట, కల్లోరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులపై ఆరా తీశారు. గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో దమ్మపేట, వేంసూరు, అన్నపురెడ్డిపల్లి, సత్తుపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలో చేపడుతున్న బ్రిడ్జీల నిర్మాణపనులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూసేకరణ, రహదారి నిర్మాణంపై కాంగ్రెస్ నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలానికి గోదావరి జలాలు రాకతో అమండలానికి చెందిన పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కోయ్యల అచ్యుతరావు, సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మురళీ, పైడి వెంకటేశ్వరరావు, వెల్ది జగన్మోహన్‌రావు, సంజీవరెడ్డి, గంగరాజు, నాగరాజు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మంగేశ్వరరావు, మన్నెం అప్పారావు, తదితరులున్నారు.

## బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ విద్యాచందన**

కొత్తగూడెంఅర్బన్,మార్చి5(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల పనితీరు మెరుగుపర్చేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో విద్యాచందన అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య మహిళాసంఘాల బ్యాంకు లింకేజీ తీరుతెన్నులపై వీసీ నిర్వహించి డీఆర్డీవో అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లాలోని 22ఏపీఎం, సీసీలతో అదనపు డీఆర్డీవో నీలేష్ వీసీ నిర్వహించారు. ఈ వీసీలో డీఆర్డీవో విద్యాచందన మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ లింకేజ్ నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇప్పటివరకు 90శాతం మేర రుణాలు పూర్తిచేశారని, మిగిలిన రుణాలను ఆర్థిక సంవత్సరం ముగింపులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ త్వరితగతిన కుట్టేందుకు మండలం నుంచి ఆరుగురు మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. మండల స్థాయిలో హబ్‌లు, గ్రామాల్లో స్పోక్‌లు ఏర్పాటుచేయాలని, జిల్లాలో స్త్రీనిధి రికవరీ శాతం పెంచాలని ఏపీఎమ్‌లు, సీసీలను వీసీలో ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి బ్యాంక్ లింకేజీలో బ్యాంక్, బ్రాంచ్‌ల వారీగా ఎదురయ్యే సమస్యలను, సందేహాలను నివృత్తి చేశారు.

# జేకే 5ఓసీ భవితవ్యం ప్రశ్నార్థకం

**మూసివేతకు రంగం సిద్ధం**


ఇల్లెందు జేకే 5 ఓసీ

ఇల్లెందు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఉన్న రెండు ఓసీల్లో బొగ్గుగనులకు పుట్టినిల్లైన ఇల్లెందులో ఉన్న జేకే 5ఓసీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. 2012 నుంచి ఉత్పత్తి ప్రారంభించిన జేకే5 ఓసీలో బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఓసీని మూసివేసేందుకు సింగరేణి యాజమాన్యం పూనుకుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఓసీలో బొగ్గు ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసేందుకే అధికారులు తగిన చర్యలకు పూనుకున్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే బొగ్గు ఉత్పత్తిలో ఇప్పటి వరకు ముందంజలో ఉన్న జేకే 5 ఓసీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 5.35లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశారు. ఇల్లెందు పట్టణానికి అతి సమీపంలో ఉన్న ఈ ఓసీ సింగరేణి యాజమాన్యం మరోకొద్ది నెలలపాటు బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ పాలింగ్ (ఊర్లటం) అయ్యే ప్రమాదం పొంచి ఉందని అందుకు మూసివేయడమే ఏకైక మార్గంగా ఉన్న సింగరేణియాజమాన్యం మూసివేసేందుకు మొగ్గు చూపుతున్నట్లుగా ఇప్పటికే పలు సాంకేతాలువెలువడ్డాయి.ప్రస్తుతం ఓసీలో 226మంది కార్మికులు పని చేస్తుండగా ఒక వేళ ఓసీ మూసి వేస్తే వీరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు ఇప్పటికే చర్యలకు పూనుకున్నట్లుగా సమాచారం. అయితే ఓసీని కొనసాగించాలని సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. గత నెలలోనే సింగరేణి డైరెక్టర్లను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ యాజమాన్యం మాత్రం జేకే5 ఓసీని ఇక కొనసాగించలేమనే అభిప్రాయానికి వచ్చినట్లుగా అధికారులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తోన్నారు. గత సంవత్సరమే పర్యావరణాన్ని కాపాడేందుకు ఓసీలో ఏర్పాటు చేసిన గ్రీనరీపై జాతీయ స్థాయిలో గ్రీన్ అవార్డు సైతం బొగ్గు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ప్రకటించింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓసీలో ఇల్లెందు జేకే 5 ఓసీ పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలకు గాను ఈ అవార్డు దక్కించుకుంది. ఇల్లెందులో నూతన ఓసీ (రొంపేడు)ని ఏర్పాటు చేసేందుకు స్టేజీ 1లో పర్యావరణ అనుమతులు పొందిన యాజమాన్యం ఇంకా మరికొన్ని అనుమతులు పొందాల్సి ఉంది. అయితే ఈ నెలలోనే జేకే5 ఓసీని మూసివేస్తే కార్మికులు ఇతర ప్రాంతాల్లో బదిలీలు చేసే పరిస్థితి కనపడుతోంది. ప్రస్తుత జేకే5 ఓసీకి అనుసంధానంగారొంపేడు ఓసీని ఏర్పాటు చేసేందుకు గతంలో ముమ్మర ప్రయత్నాలు చేసిన సింగరేణి యాజమాన్యం గత మూడు నెలలుగా ఈ ప్రయత్నాల్లో కొంత వేగవంతం తగ్గినట్లైంది. ప్రస్తుతం ఈ ఓసీని మూసివేస్తే ఇల్లెందు ఏరియా మనుగడే కష్టతరంగా మారుతోంది. టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసీ మాత్రమే ఉన్నప్పటికీ ఒక్క ఓసీతో ఏరియా మనుగడ ఎలా ఉంటుందంటూ కార్మికులు, పట్టణ ప్రజలు ప్రశ్నిస్తోన్నారు. ఇల్లెందులో సింగరేణి ప్రస్థానం కొనసాగాలని కార్మికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## క్రైం సమాచారం

### పిచ్చికుక్క స్వైర విహారం

నేలకొండపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని జగన్నాథ థియేటర్ వెనుక బజారులో బుధవారం ఉదయం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనపడ్డ వారినల్లా కరిచింది. పిచ్చికుక్క దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఉమామహేశ్వరి, చెక్కల నాగార్జున, మరియన్న, కృష్ణవేణి, వి.శ్రీను ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని తొలుత నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. సీహెచ్‌సీలో యాంటీ రాబిస్ ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జూలూరుపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వినోబానగర్ గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఏన్కూర్ నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న ఓ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న డీసీఎం డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో వ్యాన్ వెనక ద్విచక్ర వాహనంపై వస్తున్న టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన లాలు డీసీఎంను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో లాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అతనికి వైద్య చికిత్సలను అందించేందుకు 108లో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

### ఇండో ఖతార్ ఎండీపై ఫిర్యాదు

కొణిజర్ల, మార్చి5(ఆంధ్రజ్యోతి): తమపై అక్రమంగా దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నారని పేర్కొంటూ కొణిజర్ల సమీపంలోని ఓ వంచర్‌కు సంబంధించి ఇండోఖతార్ ప్రాజెక్టు ఎండీ గిరితో పాటు మరో నలుగురిపై గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ ఆథరైజ్డ్ పార్టనర్‌గా పేర్కొంటున్న ముళ్ల కిషోర్ కొణిజర్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 1న అయిదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాలు ప్రకారం గిరి ఉండే ఆఫీసు తమదని, ఈ నేపథ్యంలో అక్కడకు వెళ్లితే తమపై గిరితో పాటు మరో నలుగురు దౌర్జన్యం చేసి చంపుతామని బెదిరిస్తున్నారని, వారి వలన ప్రాణహాని ఉందని ఫిర్యాదులో కిషోర్ పేర్కొన్నాడు. కొద్దినెలలు నుంచి గిరి, ముళ్ల కిషోర్, మరి కొంతమంది మధ్య వివాదం జరుగుతూనే ఉంది.

## 75 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం పాండురంగాపురం కాలనీకి చెందిన తండ్రి, కూతురు షేక్ సైదులు, షేక్ రేష్మ 75 లక్షలకు దివాళా పిటీషన్ దాఖలుచేశాడు. వీరు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులు చేశారు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక మొత్తంలో అప్పులు చేశారు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావటంతో రుణదాలనుంచి వత్తిడి తీవ్రం కావటంతో గత్యంతరం లేక మొత్తం నలుగురుని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది అయిన మలీదు నాగేశ్వరరావు ద్వారా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో బుధవారం దివాళా పిటీషన్ దాఖలుచేశారు. తమను దివాళా దారులుగా ప్రకటించమని పిటీషన్లో కోర్టును అభ్యర్థించారు.

**రూ.60 లక్షలకు ఐపీ దాఖలు**

ఖమ్మం నగరానికి చెందిన బోగా శ్రీనివాసరావు రూ.60లక్షల 70వేల రూపాయలకు దివాళా పిటీషన్ దాఖలుచేశాడు. ఫిర్యాదిదారుడు మిర్చి వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులుచేశాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక మొత్తంలో అప్పులుచేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావటంతో రుణదాతల నుంచి వత్తిడి తీవ్రంకావటంతో మొత్తం 18 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది అయిన యర్ర జ్ఞానేష్ ద్వారా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలుచేశారు. తనను దివాళాదారుగా ప్రకటించమని పిటీషన్లో కోర్టును అభ్యర్థించారు.

**24 లక్షలకు ఐపీ దాఖలు**

ఖమ్మం నగరం శ్రీనివాసనగర్‌కు చెందిన అయ్యప్ప హాస్టల్ యజమాని కొండపల్లి లత రూ.24లక్షల 10వేల రూపాయలకు దివాళా పిటీషన్ దాఖలు చేసింది. ఫిర్యాది హాస్టల్ నడుపుతుండేది. హాస్టల్‌ను అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులుచేశారు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక మొత్తంలో అప్పులుచేయటం,. వ్యాపారంలో పెట్టుబడిపెట్టి వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావటంతో రుణదాలనుంచి వత్తిడి తీవ్రం కావటంతో మొత్తం 12 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది యర్ర జ్ఞానేష్ ద్వారా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలుచేసింది.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు

లక్ష్మీదేవిపల్లి/పినపాక/గుండాల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా పినపాక, లక్ష్మీదేవిపల్లి, గుండాల మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. "మావోయిస్టులు వద్దు.. అభివృద్ధే ముద్దు.. శాంతియుత జీవనమే మన జీవన హక్కు" అంటూ గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు వేశారు.

## ట్రాక్టర్ పై నుంచి పడి వ్యక్తి మృతి

అశ్వాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ పై నుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయపడిన ఘటన మంగళవారం రాత్రి సమయంలో మొండికుంటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మొండికుంట ఎస్‌సీ కాలనీకి చెందిన సున్నం బాలరాజు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి సమయంలో మొండికుంట నుంచి ట్రాక్టర్‌పై తన మిత్రుడు మహేష్‌తో కలిసి భద్రాచలం క్రాస్ రోడ్డు వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొండికుంట గ్రామశివారులోని మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో ట్రాక్టరు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ బాలరాజు కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి మహేష్ గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సందర్శించి ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

దమ్మపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన దమ్మపేటలో బుధవారం జరిగింది. దమ్మపేటకు చెందిన రంగు కోకిల(31) ఉదయం పిల్లలను పాఠశాలకు పంపేందుకు డ్రస్‌ను ఎలక్ట్రికల్ ఇస్త్రీపెట్టెతో ఇస్త్రీ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుధాఘాతానికి గురై నివాసంలో కుప్పకూలిపోయి స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు వెంటనే దమ్మపేట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం అశ్వారావుపేట తరలించగా పరిశీలించిన డాక్టర్లు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగర శివారులోని రామన్నపేటకు చెందిన షేక్ ఖాసీం(38) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన అతను ఇంట్లో భార్యతో డబ్బుల విషయమై గోడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి డబ్బులు కావాలని భార్యతో గొడవ పడటంతో తన వద్ద డబ్బులు లేవని భార్య చెప్పింది. దీంతో భార్య వంట గదిలో ఉండగా ఖాసీం బెడ్‌రూంలోకి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## సూపరింటెండెంట్ గది దహనానికి యత్నం

**తలుపు వద్ద పెట్రోలు పోసి అంటించిన గుర్తు తెలియని వ్యక్తి**



భద్రాచలం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ గది దగ్ధానికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రయత్నించారు. మంగళవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో డోరు వద్దకు వచ్చి పెట్రోలు చల్లి నిప్పంటించారు. అది కేవలం డోరు కింది భాగంలోని టైల్స్‌కి పరిమితం కావడంతో ఇతరత్రా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కాగా బుధవారం సూపరింటెండెంట్ కార్యాలయ గదిని సిబ్బంది తెరిచిన సమయంలో ఈ ఘటన గమనించడంతో సిబ్బంది ఈ విషయాన్ని సూపరింటెడెంట్ ఎం.రామకృష్ణకు నివేదించారు. దీంతో ఆయన వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కాగా వైద్యశాల ప్రాంగణంలో సీసీ టీవీల వ్యవస్థ ఉండటంతో సీసీ టీవీ ఫుటేజీలను చూసిన సిబ్బంది ఒక గుర్తు తెలియని వ్యక్తి బాటిల్‌తో రాత్రి 11 గంటల సమయంలో పెట్రోలుతో ఉన్న బాటిల్‌ను తీసుకొచ్చి గది తలుపు వద్ద టైల్స్‌పై పోసి నిప్పంటించినట్లు గమనించారు. ఈ క్రమంలో భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ బరపాటి రమేష్ తమ సిబ్బందితో వచ్చి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇదే సమయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా వైద్యశాలలో ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజి సైతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి.

**ఇది తెలిసిన వారి పనేనా !**

భద్రాచలం వైద్యశాలలో సూపరింటెండెంట్ గది వద్ద పెట్రోలు పోసి నిప్పంటించారన్న వార్త సర్వత్రా సంచలనంగా మారింది. ఏరియా వైద్యశాల చరిత్రలో ఈ విధంగా ఎప్పుడూ జరగలేదని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. వైద్యశాల రెండో అంతస్తులో ఉండే ఈ గది వద్దకు తెలిసిన వారే వచ్చే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైద్యశాలలో పని చేసి మానేసిన వారే ఈ ఘటనకు పాల్పడ్డారా లేదా బయటి వ్యక్తుల పనేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు పాల్పడిన వ్యక్తి బక్కగా షార్ట్ వేసుకొని ఉన్నట్లు సీసీ కెమెరాలో కనిపిస్తోందని తెలుస్తోంది. సూపరింటెండెంట్ ఫిర్యాదు నేపథ్యంలో భద్రాచలం సీఐ బి.రమేష్ ఘటనా స్థలానికి వచ్చి వివరాలను సేకరించారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## బొడ్రాయి ప్రతిష్ఠకు ప్రత్యేక బస్సులు

**ఖమ్మం,పొద్దుటూరు,బోనకల్ మార్గంలో నేడు ఒక్కరోజు సర్వీసులు**

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పొద్దుటూరు గ్రామంలో గురువారం బొడ్రాయి(నిభిశిల) ప్రతిష్ఠ మహోత్సవం నేపథ్యంలో ఖమ్మం, పొద్దుటూరు, బోనకల్ మార్గంలో గురువారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఖమ్మం పాతబస్టాండ్ నుంచి ఉదయం 9:30గంటలకు, మధ్యాహ్నం 12:30గంటలకు, సాయంత్రం 3:30, 6:30కు, బోనకల్ నుంచి ఉదయం 8గంటలకు, 11గంటలకు, మధ్యాహ్నం 2గంటలకు, రాత్రి 8 గంటలకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## పోలీసు కుటుంబాలకు కంటి పరీక్షలు

ఖమ్మంక్రైం,మార్చి5(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుబాలకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసుకమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. నగరంలోని పోలీసుహెడ్‌క్వార్టర్స్ కల్యాణమండపంలో బుధవారం ఓ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని సీపీ సునిల్‌దత్ ప్రారంభించారు. సిబ్బందికి ఆరోగ్యవంతమైన కంటిచూపుకోసం వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, కంటి చూపును మెరుగుపరుచుకోవడం అలాగే కంటిచూపు సరిగా లేని వారికి రాయితీతో శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈనెల 12వరకు కళ్యాణమండపంలో కంటి వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని, వివిధరకాల కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశం సద్వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈకార్యక్రమంలో ఏఆర్‌ఏసీపీ నరసయ్య, సుశీల్‌సింగ్, శివరాం, రాజేష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు పరిశీలిస్తున్న సీపీ

## దండి భాస్కర్ చలివేంద్రం ప్రారంభం

ఖమ్మంరూరల్,మార్చి5(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో కామ్రేడ్ దండి భాస్కర్ జ్ఞాపకార్థంగా మినరల్ వాటర్ కూల్‌క్యాన్లతో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, వెంపటి రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య భూములకు శఠగోపం

- కోట్లాది రూపాయల భూములు అన్యాక్రాంతం
- సర్వే జరిగినా హద్దుల ఏర్పాటులో అధికారుల విఫలం
- రైతులకు నోటీసులిచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఒకటో డివిజన్ క్రైకోండాయిగూడెం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. వందేళ్లకు పైగా చరిత్ర గల ఈఆలయానికి దాతలు పూర్వంలో భూములను కేటాయించారు. కాలక్రమేణా భూములకు ధరలు భారీగా పెరగటంతో గ్రామానికి చెందిన కొందరు కన్ను పడింది. ఈ విషయమై ఆంధ్రజ్యోతి పలు కథనాలను ప్రచురించినా దేవాదాయ, ధర్మాదాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించి ఆలయ భూములు రైతుల వద్ద ఉన్నాయని తెలుసుకోని సంభందిత రైతులకు నోటీసులు జారీచేసింది. అయినా ఫలితం లేకపోవటంతో అధికారులు ఈ భూముల వ్యవహారం కోర్టులో కేసు నమోదు చేశారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా..**

గతఏడాది మార్చిలో దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారులు సుమారు 20మంది ఆలయ భూమల సర్వే చేసేందుకు వచ్చి కేవలం రైతులతో మాట్లాడి వెళ్లారు. ఆక్రమణదారులతో లాలూచీ పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి గతంలోనే ఈ రైతులందరికి భూమి విషయమై నోటీసులు అందించారు. 2021 డిసెంబరు 10న ఆంధ్రజ్యోతిలో ముక్కంటి భూములపై పూజారి కన్ను, డిసెంబరు 31న బోర్డు పెట్టారు సర్వే మరిచారు, 2022 ఆగస్టు 21న దేవుడికే శఠగోపం అనే కథనాలు ప్రచురించారు.కథనాలు వచ్చిన ప్రతిసారీ అధికారులు రావడం రైతులతో మాట్లాడటం తప్ప భూముల సర్వే మాత్రం నిర్వహించడం లేదు.

**కానరాని 20ఎకరాల భూమి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు అధికార పార్టీ నాయకుల అండ కారణంగానే ఈ భూముల సర్వే జరగటంలేదని తెలుస్తుంది. ప్రస్తుత ధరణిలో శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం పేరిటనే 20.24 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం సుమారు 12 ఎకరాలు కూడా కనిపించడంలేదు. ఈ భూముల విలువ ప్రస్తుతం కోట్లలో పెరగటంతో ఈ భూమిని సొంతం చేసుకోవాలనే ఆశతో కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల సహకారంతో సర్వే జరగనివ్వకుండా అడ్డుకుంలున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. ఏటా 20.24 ఎకరాలుగానే వేలం నిర్వహిస్తుంది. సుమారు 1లక్ష 20వేలకు పైగా ఆదాయం వస్తున్నట్లు అధికారులే చెప్తున్నమాట. అన్ని ఆధారాలు ఉన్నా శివయ్య భూముల సర్వే వచ్చేసరికి అధికారులు వెనకడుగు ఎందుకు వేస్తున్నారో తెలియని ప్రశ్న.



ఆలయ భూముల్లో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

**కమిటీ లేకపోవటంతో అన్యాక్రాంతం**

ఆలయం 2020లో దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లినప్పటికి పూర్తిస్థాయి కమిటీ లేకపోవటం కూడా కారణమని, కమిటీని నియమిస్తే భూముల పరిరక్షణ చూసుకుంటుందని స్థానికుల వాదన.. దేవాదాయ శాఖ అధీనంలో లేనప్పుడు గ్రామానికి చెందిన పలువురు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. కానీ వారు ఆలయ భూములు కాపాడటంతో విఫలమయ్యారు.

## టీడీపీ నాయకుడు సత్యానందం కన్నుమూత

నేలకొండపల్లి,మార్చి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు కుక్కల సత్యానందం (70) బుధవారం తెల్లవారు ఝామున మృతి చెందారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులున్నారు. సమాచారం అందుకున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. తెలుగుదేశం పాలేరు ఇన్‌ఛార్జి కొండబాల కరుణాకర్, జిల్లా అధికార ప్రతినిధి ఆరెకట్ల కొండలరావు, జిల్లా కార్యదర్శి నాగార్జున మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ.5వేలు అందజేశారు. కారంగుల వీరబాబు, మందడపు హనుమంతరావు, మారగాని రాజశేఖర్, మారగాని గోవర్ధన్, మందడపు హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు యడవల్లి సైదులు, మల్లెల రవికుమార్, గండారపు వెంకటలక్ష్మి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



# హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- ప్రభుత్వ పథకాల నుంచి సంపూర్ణ లబ్ధి చేకూర్చుతాం
- దివ్యాంగులు గౌరవప్రద జీవనం గడిపేలా కృషి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు గౌరవప్రదద జీవనం గడిపేలా కృషి చేస్తున్నామని, వారికి ప్రభుత్వం తరఫు నుంచి పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూనిక్ డిజెబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) పొందే విధానంపై దివ్యాంగులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగులందరికి హక్కులు కల్పించే చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమంలో దివ్యాంగులకు రిజర్వేషన్‌కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఉపాధిశాఖ సమన్వయంతో ప్రత్యేక ఎంప్లాయి మెంట్ ఎక్స్ చెంజ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ప్రాతిపదికన నియమించబడే డేటాఎంట్రీ ఆపరేటర్లలో దివ్యాంగులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులు సమాజంలో గౌరవప్రద జీవనం గడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అక్టోబరు 31, 2023 వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్ల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపి యూడీఐడీ కార్డులను సిద్ధం చేశామని, వీటిని త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. మిగతా వారి సర్టిఫికెట్ల వివరాలను పంపి వారికి కూడా యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూడీఐడీ. పోర్టల్‌లో కొత్తవ్యాధులను కూడా చేర్చినట్లు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఫోన్‌కు మెడికల్ క్యాంపు సమాచారం మెసేజ్ ద్వారా అందుతుందన్నారు.కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులుగా యూనిక్ డిజేబిలిటీ ఐడి కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈఅవగాహన సదస్సులో డీఆర్వో ఏ.పద్మశ్రీ, జెడ్పీసీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లాసంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి,డీఈవో సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

**క్రచ్ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్**

క్రచ్ సెంటర్‌ను పిల్లలకు ఆకర్షణీయంగా ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో క్రచ్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి తనిఖీ చేశారు. రాబోయే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని క్రచ్ సెంటర్లో ఏసీ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన ఆట వస్తువుల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ, క్రచ్ ఇన్‌చార్జ్ రాణి తదితరులున్నారు.

## టీఎన్జీవో పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి5(ఆంధ్రజ్యోతి): మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆవిష్కరించారు. టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా కలెక్టర్ మహిళా విభాగాన్ని అభినందించారు. ఏంక్రీడలు నిర్వహిస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలున్న తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని కలెక్టర్ ముజామిల్ ఖాన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్ పర్సన్ జి.మృదుల, కన్వీనర్ బి.వి. సుబ్బమ్మ టీఎన్జీవోస్ యూనియన్ జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొనిదెన శ్రీనివాస్, వలపు వెంకన్న జాయింట్ సెక్రెటరీ శీలం రాధికా రెడ్డి, నెల్లూరి విజయ, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, వెంకటమ్మ, భావన వెన్నెల, కోమలి, శ్రావణి, హసీనా, వసంత, రమ్య, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

# ట్రావెల్స్ ఏజెన్సీకి జరిమానా

- జిల్లా వినియోగదారుల ఫోరం తీర్పు
- విహారయాత్రకు డబ్బులు చెల్లించినా తీసుకెళ్లని వైనం
- సొమ్ముతోపాటు, ఏడుశాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని తీర్పు

ఖమ్మంలీగల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): థాయిలాండ్ విహారయాత్ర కోసం చెల్లించిన డబ్బులను విహారయాత్ర సౌకర్యాలు అందించకుండా ఇబ్బందికి గురిచేసిన అర్చన ట్రావెల్స్‌ను పరిహారం చెల్లించాల్సిందిగా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత బుధవారం తీర్పుచెప్పారు. ఫిర్యాదుదారుని తరఫున వెల్లంపల్లి నరేంద్రస్వరూప్, ఎం.అప్పారావు, కొలికొండ శరత్‌బాబు న్యాయవాదులుగా వ్యవహరించారు. దంసాలాపురం గ్రామానికి చెందిన తుమ్మ అప్పిరెడ్డి వ్యాపారవేత్త. భార్యతో కలిసి విహారయాత్రకు వెళ్లేందుకు అర్చన ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్ టూర్ ఆపరేటర్ బద్దం బోజిరెడ్డిని సంప్రదించారు. 2023లో ఏప్రిల్‌లో రూ.71వేల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించారు. నాటినుంచి ఏదో కారణాలతో ప్రయాణాన్ని వాయిదా వేస్తూ ఉన్నారని తెలిపారు. తదుపరి మరింత ఆకర్షణీయమైన టూర్‌ప్యాకేజీ ఉందని మాయమాటలతో అదనపు చార్జీ అడ్వాన్సుగా వసూలు చేశారని పేర్కొన్నారు. చెల్లించిన డబ్బులను తిరిగి రాబట్టుకునేందుకు ట్రావెల్స్ వారి చుట్టూ తిరిగేందుకు కూడా చాలా ఖర్చుపెట్టానని కేసులో తెలిపారు. విలువైన సమయం, అడ్వాన్సుగా చెల్లించిన డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినందుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. ఈ కేసును విచారణ జరిపిన అనంతరం తుమ్మ అప్పిరెడ్డి చెల్లించిన రూ.71వేలు, కేసు నమోదు చేసిన నాటినుంచి 7శాతంవడ్డీ, ఫిర్యాదుదారులకు జరిగిన ఇబ్బందికి, వేదనకు పదివేలు మరియు లిటిగేషన్ ఖర్చులకు పదివేలు 45రోజుల్లోపు చెలించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో వినియోగదారుల తరుపున న్యాయవాదులు మల్లెంపాటి అప్పారావు, వెల్లంపల్లి నరేంద్రస్వరూప్, కొలికొండ శరత్‌బాబు న్యాయవాదులుగా వ్యవహరించారు.

# వసూళ్ల లక్ష్యాలను సాధించండి

- డీపీఓ ఆశాలత
- నేలకొండపల్లిలో తక్కువ వసూళ్లపై అసంతృప్తి



నేలకొండపల్లిలో మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

నేలకొండపల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): పన్నుల బకాయిలను నూరుశాతం వసూలు చేసి లక్ష్యాలను సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత కార్యదర్శులను ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మర్రి యర్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. మండలంలో రూ.1.50 కోట్లు లక్ష్యంగా ఉండగా కేవలం రూ.50 లక్షలు మాత్రమే వసూలు చేయటం పట్ల డీపీఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 52శాతం పన్నులు వసూలు చేస్తే మిగిలినవి ఎప్పుడు వసూలు చేస్తారంటూ ప్రశ్నించారు. మార్చి నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో వసూలు జరగాల్సిందేనని ఆదేశించారు. ఇందుకోసం కార్యదర్శులు తీవ్రంగా కష్టపడాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీఓ శివ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పురపాలనలో మరింత సౌలభ్యం

**కాంగ్రెస్ నాయకుడు దయాకర్ రెడ్డి**

ఖమ్మం రూరల్,మార్చి 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీలతో పోలిస్తే పురపాలకంతో పాలన మరింత సౌలభ్యంగా ఉంటుందని, మంత్రి పొంగులేటి ఆశీస్సులతో ఏదులాపురం నూతన మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు తుంబూరి దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 12 గ్రామాల ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. త్వరలోనే మున్సిపాలిటీకి ఎన్నికలు వస్తాయని అప్పటిలోగా పార్టీని ఇంకా మరింత పటిష్ట పరుచుకోవాలని ఆయా ప్రాంతాల నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధరావత్ రాంమూర్తి నాయక్, తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్ రెడ్డి

## రుణాలను సద్వినియోగం చేసుకోండి

**ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ లింగస్వామి**

నేలకొండపల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి రుణాలను తీసుకునే మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ లింగస్వామి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నేలకొండపల్లి ఎస్‌బీఐలో మహిళలకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 50 మంది మహిళలకు సేవలందించారు. స్వయం సహాయక సంఘాలు తీసుకునే రుణాలు గురించి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివరించారు. స్వయం సహాయక సంఘాలకే గాకుండా వ్యక్తిగతంగా కూడా స్వయం సిద్ధ రుణాలను ఎస్‌బీఐ అందిస్తున్నదన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు రీజినల్ మేనేజర్ లింగస్వామి బహుమతులను అందించారు. కార్యక్రమంలో నేలకొండపల్లి బ్రాంచి మేనేజర్ బాణోతు వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ సత్యం, సర్వీస్ మేనేజర్ బాలజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.



రుణం అందిస్తున్న బ్యాంకు అధికారులు

## రాయల వర్ధంతిని జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్,మార్చి5(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ రవన్న తొమ్మిదో వర్ధంతి సభను విజయవంతం చేయాలని మాస్‌లైన్ నాయకులు బండెల వెంకయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో బుధవారం ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు.ప్రజా హక్కుల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి, జీవితాంతం అజ్ఞాత జీవితం గడిపిన త్యాగశీలి రవన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మారుతి మల్లయ్య, కుర్ర వెంకన్న, మల్లయ్య, అప్పారావు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: 8న రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతిసభ, పిండిప్రోలు మాజీ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండంలోని పిండిప్రోలులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్.శివలింగం, టి.హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పుల్లయ్యసరోజిని, వెంకటస్వామి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి5(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు భోజన వసతి కలిపించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తూనే భోజన వసతి, సౌకరాయలు కలిపించడంలో పలు కళాశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, హాల్‌టికెట్లు ఇవ్వబోమని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బదులు పెట్టడం సరికాదన్నారు ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రామకృష్ణ, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

## రాకాసితండా వాసులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకాసితండా గ్రామస్తులు వరదమూలంగా సర్వం కోల్పోయవారని వారిని అన్నివిధాల ఆదుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, జర్పుల లీల, బోడ మోహన్, బాబురావు, సుజాత, రాందాస్, జ్యోతి, సునిత పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం సమస్యలపై సర్వే

తిరుమలాయపాలెం, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఎదుర్కొటున్న ప్రజాసమస్యలపై ఈనెల10నుంచి గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లానాయకుడు బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, ఎ.నరసయ్య, పి.సుధాకర్, వి.వీరన్న, పి.ప్రసాద్,ఆర్.రవి, పాల్గొన్నారు.

## పూణే తరలిన కార్పొరేటర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి5(ఆంధ్రజ్యోతి): మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో అధికారులు, 43మంది కార్పొరేటర్లు బుధవారం పూణే తరలి వెళ్లారు. సీడీఎంఏ సర్క్యులర్‌తో పూణేలో రెండురోజుల పాటు సభ్యులు పర్యటించనున్నారు. ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి తిరిగి వినియోగం తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలంచానున్నారు.



## పని చేయకున్నా ఉపాధి పనుల్లో మస్టర్

**ఉపాధిహామీ ప్రజాదర్బార్‌లో వెలుగులోకి**

ఖమ్మం రూరల్, మార్చీ5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉపాధిహామీ పనులపై నిర్వహించిన ప్రజాదర్బార్ తూతూమంత్రంగా జరిగింది.2023 నుంచి 2024 వరకు జరిగిన పనులపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సిబ్బంది సామాజిక తనిఖీ చేసి అధికారులకు నివేదిక అందజేశారు. ఈ నివేదికలపై అడిషనల్ డీఆర్‌డీఓ చుంచు శ్రీనివాసరావు పంచయతీల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్‌లను, మేట్‌లను, గ్రామకార్యదర్శులను విడివిడిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు ఏమేరకు జరిగాయి, హాజరు పట్టికలో కూలీల మస్టర్ సరిగా వేశారా, చేసిన పనికి కూలీలకు ఎంతమేరకు వేతనాలు చెల్లించారనే అంశాలపై ఆరా తీశారు. అయితే పలు గ్రామాల్లో చేసిన పనికి, హాజరు పట్టికలో వేసిన మస్టర్‌లకు పరిపోలక పోవడంతో వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పనికి రాకున్నా పనికి వచ్చినట్లు హాజరు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఏపీఓ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



## 9న రవన్న వర్ధంతి సభ

సత్తుపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మితవాదవాదాలకు వ్యతిరేకంగా ప్రజాపంథాకై పోరుసలిపిన రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభను ఈ నెల 9న ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం సత్తుపల్లిలో జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సభలకు రమేష్ పట్నాయక్, కేఎస్.సతీష్‌చంద్ర, కేజీ.రామచంద్రలు హాజరై ప్రసంగిస్తారని, యువత అధికంగా పాల్గొనాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో గంటా శ్రీను, అమర్లపూడి శరత్, తాటి రాజు, బొజ్జ విశ్వనాధం, చెన్నారావు, కొత్తపల్లి పున్నయ్య, పాలకొల్లు సత్యం, విశ్వనాధం, వెంకటేశ్వరరావు, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్‌లో 'మదర్ థెరిస్సా' ప్రతిభ



విద్యార్థులతో యాజమాన్యం, అధ్యాపకులు

సత్తుపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): గత జనవరి, ఫిబ్రవరిలో జేఎన్‌టీయూహెచ్ నిర్వహించిన బీటెక్ 3వ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ బుధవారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిలో ఈసీఈలో ఎండీ.అమీరాఅంజుమ్, బొట్టు తేజశ్వి, షేక్ హిస్రాత్‌ఆరా, సీఎస్సీ నుంచి గాండ్ల హిందుశ్రీ, పసుపులేటి నాగజ్యోతి, రావుల అరుంధతి, గంధం నిహిత, ఏఐఎంఎల్ నుంచి పిట్టల ఉష, దూబా సూర్యప్రకాష్, ఈఈఈ నుంచి కల్లేపల్లి గౌతమి, చక్రం సింహాద్రి, కొమరవరపు మారేష్, నాదెళ్ల నితీష్‌చౌదరి, మైనింగ్‌లో రాచమళ్ల సాయిశివసుందరరావు, ఆదెర్ల లోకేష్, జక్కుల అన్వేష్, సివిల్‌లో బెజవాడ పూర్ణిమలు ఉన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా. ఎంవీ.రామచంద్రరావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

సత్తుపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ప్రతిఒక్కరూ ఆత్మస్థైర్యంతో ఉండాలని, పరీక్షలపై ఉన్న భయాలను తొలగించుకోవాలని ఆర్థమెటిక్, రీజనింగ్ నిపుణులు నరసింహారావు అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్.కే.పద్మారాణి ఆధ్వర్యంలో బుధవారం పోటీ పరీక్షలలో పేపర్‌ల గురించి, చదవాల్సిన పుస్తకాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్దిష్టమైన ప్రణాళికతో సరైన అవగాహనతో ముందుకు వెళితేనే విజయం సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే.పీర్‌సాహెబ్, అధ్యాపకులు వై.మహేష్, డాక్టర్ ఎం.బాలకృష్ణ, డాక్టర్ సీహెచ్.పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



నాగమణి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ముదిగొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవల్లి, మేడేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం పర్యటించారు. ఎడవల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన శెట్టి వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మేడేపల్లి మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి హరిప్రసాద్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ముదిగొండ, ఖమ్మంరూరల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, బొల్లం వేణు, నాయకులు బంకా మల్లయ్య, శంకర్, మీగడ శ్రీనివాస్, బిక్షం, వీరనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



రఫీ పాషా



నవ్య

కల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్శిటీ వరంగల్ పరిధిలో ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో కల్లూరులోని ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో ఓ గ్రేడ్ సాధించుకుంటు ర్యాంకులు పొందారు. డిగ్రీ 01, 03, 05 సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఓ గ్రేడ్‌తోపాటుగా ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. డిగ్రీ ఫైనల్ సంవత్సరపు ఫలితాలు (5 సెమిస్టర్). బీఎస్సీ (బిజెడ్సీ) జి నవ్య 9.01 యూనివర్శిటీ ర్యాంకు, ఎం గౌతమి 8.85 ర్యాంకు, బీఎస్సీ (ఎంపీసీఎస్)లో ఆర్ ఉమారాణి 8.67 ర్యాంకు, బీకాం (సీసీఏ)లో యస్‌కె రఫీపాషా 7.61 ర్యాంకు, పి శివశంకర్ 7.35 ర్యాంకు సాధించగా, బీఏ (హెచ్ఇపి) ఎండి అఫ్రా 8.51 ర్యాంకు సాధించనైనది. పై విధంగా తమ కళాశాలలో యూనివర్శిటీ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ లక్కినేని రఘు, ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ లక్కినేని ప్రసాద్, ప్రతిభ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రసాద్, జి.నాగేశ్వరరావుతోపాటుగా అధ్యాపక బృందం అభినందించారు.

## శ్రీపాల్‌రెడ్డి విజయంతో సంబరాలు

బోనకల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పీఆర్టీయు నేత పింగళి శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా విజయం సాధించడంతో బోనకల్‌లో బుధవారం పీఆర్టీయు నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పని చేస్తారని తెలిపారు. ఆయన విజయం బాధ్యత పెంచిందని ఉద్యోగుల కొరకు శాసనమండలిలో తన గొంతుక వినిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు జిల్లా, మండల నాయకులు రత్నకుమార్, కాంతారావు, కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్ రవి కుమార్, కొనకంచి రమ్మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, గుత్తా శ్రీనివాసరావు, రామారావు, రాజేష్, రవి కిరణ్, చిలక విద్యాసాగర్, పగిడల రవి, కిరణ్మయి, మౌనిక, పావని, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

## రఘుకు క్రైస్తవ సంఘ నాయకుల పరామర్శ

కల్లూరు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని రఘును బుధవారం అఖిల భారత క్రైస్తవ సంఘ నా యకులు పరామర్శించారు. ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకొని తమ నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న రఘును ఏఐసీసీ క్రైస్తవ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఏనోష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు క్రైస్తవ సంఘ నాయకులు పరామర్శించారు. రఘు ఆరోగ్య పరిస్థితిని వారు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజా సేవలో యధావిధిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం త్వరితంగా కుదుటపడాలిని ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన అనేక క్రైస్తవ కార్యక్రమాల్లో అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ ప్రత్యేక కృతజ్ఞతగా రఘును శాలువతో సత్కరించి వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ క్రైస్తవ సంఘం నాయకులు టి.ఏబినేజర్, ధర్నాసి బాలరాజు, పి.దయాకర్, ఎం.జాన్‌పరంజ్యోతి, ఎ.రాజశేఖర్, స్టీపెన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

### సత్తుపల్లిలో 131 మంది విద్యార్థుల గైర్హాజరు



సత్తుపల్లిలోని ఓ కేంద్రం వద్ద విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. సత్తుపల్లిలో తొలిరోజు 131మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం ఏడు కేంద్రాలను కేటాయించగా 1489కి గానూ 1358మంది విద్యార్థులు హాజరయ్యారు.

**ముదిగొండలో..**

ముదిగొండ: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 174మందికిగానూ 166మంది విద్యార్థులు హాజరుకాగా 8మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు తాగు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు.

**మధిరలో..**

మధిరటౌన్: ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. తొలి రోజ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మధిరలో మొత్తం 1048 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా అన్ని కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుండే విద్యార్థులు వారి తల్లి తండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయదాసు పరీక్షల కన్వీనర్ గా వ్యవహరించారు.

**చింతకానిలో..**

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కేంద్రంలో మొత్తం 138 విద్యార్థులకు గాను 132 మంది హాజరవ్వగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

**బోనకల్లులో..**

బోనకల్ ఇంటర్ మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు మొత్తం 206 మందికి గానూ తొలిరోజున 4గురు గైర్హాజరయ్యారు. సెంకడ్ ఇయర్ పరీక్షలకు 190 మంది హాజరు కానున్నారు. విద్యార్థులను పకడ్బందీగా తనిఖీలు చేసి లోపలకు పంపారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎస్ఐ మధుబాబు, ప్రిన్సిపాల్ నళినీశ్రీలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

**వైరాలో..**

వైరా: వైరాలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెండు గురుకుల బాలికల జూనియర్ కళాశాలలు, మధు జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 805మందికిగానూ 765మంది విద్యార్థులు హాజరుకాగా 40మంది గైర్హాజరయ్యారు.

# 'జాలిముడి'ని సందర్శించిన బీఆర్ఎస్ బృందం



రైతులతో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

మధిర రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం జాలిముడి వద్దగల సాగునీటి ప్రాజెక్టును బుధవారం మధిర బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించింది. మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజ్ ఆధ్వర్యంలో మండల నాయకులంతా ఈ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీచైర్మన్ కమల్‌రాజ్ మాట్లాడుతూ కోట్లరూపాయలు ఖర్చుపెట్టి ఈ ప్రాజెక్టును నిర్మించినా కానీ ఆయకట్టు రైతాంగానికి నీరందడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టు పిల్లర్ కుంగిపోయిందని, 50మీటర్ల మేర కాల్వ కూడా కొట్టుకుపోయిందన్నారు. పంట పొలాలకు నీరందించే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కాల్వలు కొట్టుకుపోతే ప్లాస్టిక్ పైపులు వేసుకొని నీళ్లు అందించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీను, యన్నంశెట్టి అప్పారావు, చావా వేణు, కటికల సత్యనారాయణరెడ్డి, కర్నాటి శ్రీను, బొగ్గుల వీరారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

# సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందండి

సత్తుపల్లిరూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించి రైతులు వడ్డీ రాయితీ పొందాలని సత్తుపల్లి డీసీసీబీ మేనేజర్ జంగం కిషోర్ కోరారు. బుధవారం ఆయన డిప్యూటీ రిజిస్ట్రర్ ఏ.శ్రీనివాసరావు, అయ్యగారిపేట బీఎం శివసత్యనారాయణ, ఏజీఎం ప్రవీణ్‌లతో కలిసి రుణాల రికవరీలో భాగంగా సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలో పర్యటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న ఏకైక బ్యాంక్ తమదేనని, కేవలం 10నిమిషాలలో 80పైసల వడ్డీకే బంగారంపై రుణాన్ని గ్రాముకు రూ.5800ఇస్తామన్నారు. ఎన్‌పీఏలో ఉన్న రుణాలు తీసుకున్న ఖాతాదారులు ఈనెల 15వ తేదీలోగా వడ్డీతో సహా చెల్లించి సహకరించాలని కోరారు. అదేవిధంగా విద్య, వ్యవసాయ, ముద్ర, పశువులు, మార్ట్‌గేజ్ రుణాలు పొందిన వారు వాయిదాల పద్ధతిలో క్రమం తప్పకుండా చెల్లించి మరిన్ని ప్రయోజనాలు పొందాలని సూచించారు. వ్యవసాయ రుణాలను ఏడాదిలోపు రెన్యూవల్ చేయడంతో ద్వారా 7శాతం మాత్రమే వడ్డీ పడుతుందని, నిర్దిష్ట తేదీలోపు చెల్లించిన వారికి తిరిగి 3శాతం వారి ఖాతాకు జమవుతుందని చెప్పారు. ఏడాది లోపు రెన్యూవల్ కాకపోతే అధిక వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని, రుణాలు చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా రుణాలు కావాల్సిన వారు నేరుగా బ్యాంకును సంప్రదించాలని, దళారులను ఆశ్రయించ వద్దన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జనార్ధన్, రాకేష్, సర్తాజ్ పాల్గొన్నారు.

# ఐకేపీ ఏపీఎంపై చర్యలు తీసుకోండి

### ఎమ్మెల్యే రాగమయికి మొరపెట్టుకున్న గ్రామ దీపికలు



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న గ్రామ దీపికలు

కల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఐకేపీ పరిధిలో పలు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామదీపికలపై అసభ్యకరంగా, అవమానకరంగా దూషిస్తున్న ఏపీఎం రాంబాబుపై తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిని పలువురు గ్రామదీపికలు కలిసి మొర పెట్టుకున్నారు. మహిళలని చూడకుండ అనకూడని మాటలు అంటూ మానసికంగా వేధిస్తున్నాడని, తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కల్లూరు మండల గ్రామదీపికలు ఎమ్మెల్యే రాగమయికి విన్నవించుకున్నారు. తాము అనేక సంవత్సరాలుగా వీవోఏలుగా పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేస్తున్నామని వారు వివరించారు. గ్రామదీపికలపై ఏపీఎం చేస్తున్న ఆగడాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాగమయి ఏపీఎం రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారని వీవోఏలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, మండల నాయకుడు దామాల దయాకర్‌రావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వేమే రాం బాబు, గ్రామదీపికల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి, నాగలక్ష్మి సునీత తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో వ్యవసాయరంగం: బాగం





మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఏన్కూరు, మార్చి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం ఏన్కూరులో తెప్పల సత్యం అధ్యక్షతన జరిగిన మండల రైతుసంఘం 3వ మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మూడు నల్లచట్టాలు తీసుకవచ్చి దొడ్డిదారిన అమలుచేయడానికి కుటిల ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు తక్షణమే అమలుచేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నియోజకవర్గ కార్యదర్శి యర్రాబాబు, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అమరనేని వీరబద్రం, జిల్లా రైతు సంఘం కోశాధికారి కూచిపుడి రవి పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్షుడిగా బానోతు లఘుపతి, ప్రధాన కార్యదర్శి నల్లపాటి నరసింహారావుతోపాటు 17మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

## 'పది' విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



వైరా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వాహకుడు షేక్.లతీఫ్ ఆధ్వర్యంలో బుధవారం వైరా ఎంపీఐ వరప్రసాద్ పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. సిరిపురం హైస్కూల్లో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో ఎంపీఐ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరీక్ష ప్యాడ్లు, ఇతర మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శాస్త్రీయ సలహాసంఘ సమావేశం

వైరా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం వ్యవసాయ సంబంధమైన శాస్త్రీయ సలహాసంఘ సమావేశం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గత సంవత్సరం చేసిన విస్తరణ విభాగ కార్యక్రమాలు, ఈ సంవత్సరం చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. మధ్యతెలంగాణ మండలి సహాయ పరిశోధన సంచాలకుడు, ప్రాంతీ వ్యవసాయ పరిశోధన సంస్థ వరంగల్ డాక్టర్ ఉమారెడ్డి, అటారీ, జోన్-10 హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త ఏఆర్.రెడ్డి, పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే సంవత్సరంలో వివిధ పంటల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవగాహన, శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు.

## నేడు ముదిగొండలో భట్టి పర్యటన

ముదిగొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. ముదిగొండ ప్రధాన సెంటర్ నుంచి వల్లభి వెళ్లే ఐదుకిలోమీటర్ల వరకు డబుల్‌రోడ్డును రూ.28కోట్లతో చేపట్టనున్న నాలుగులైన్ల రోడ్డు విస్తరణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఈ పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గుండెపోటుతో యువకుడి మృతి

సత్తుపల్లిరూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామంలోని చాకలి ఐలమ్మ సెంటర్‌కు చెందిన గజవెల్లి నాగేశ్వరరావు కుమారుడు ప్రేమ్‌సాగర్ (సుబ్బు-22) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. రాత్రి భోజనం తీసుకున్న కొద్దిసేపటి తర్వాత ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సుబ్బు మృతివార్త తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## జేవీఆర్ ఓసీ-3ను ప్రైవేట్ పరం చేయొద్దు

సత్తుపల్లిరూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ 3బ్లాక్, వీకేఓసీలను ప్రయివేటు పరం చేయొద్దని ఏఐటీయూసీ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ కోరారు. బుధవారం జేవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిప్యూటేషన్‌లో ఉన్నవారిని పర్మినెంట్ చేయడం, కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి కంపనీ తరపున ఉచిత బస్సులు కేటాయించడం, యాక్టింగ్‌లో ఉన్నవారికి డిసిగ్నేషన్లు కల్పించడంపై చైర్మన్ స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఈనెల 10వ తేదీన కొత్తగూడెం జీఎం ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

మధిరటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం శ్రీకృష్ణ సూర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మధిర టీవీఎం పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 120 మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనగా ప్రథమ బహుమతిని మధిర హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలకు, ద్వితీయ బహుమతి నిదానపురానికి, తృతీయ బహుమతి దెందుకూరు పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి వై.ప్రభాకర్ బహుమతులు అందచేయగా, కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు మాటూరు ప్రభుత్వ పాఠశాల పి.డి బొగ్గుల శ్రీనివాసరెడ్డి పలువురు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ అందజేత

మధిర రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో నాగసైదా అనే నిరుపేద కుటుంబానికి మధిరకు చెందిన ఉపాధ్యాయుడు చేడే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ అందజేశారు. బుధవారం మడుపల్లి గ్రామానికి వెళ్లి నాగసైదా కుటుంబానికి కుట్టు మిషన్ అందించారు. కార్యక్రమంలో దాత చేడే శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు కోట జయరాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాంబాబు పాల్గొన్నారు.

## హెలిప్యాడ్‌ను పరిశీలించిన అధికారులు

ముదిగొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ మేరకు బుధవారం ముదిగొండలోని ఎడవల్లి లక్ష్మీపురం రోడ్డులో హెలీప్యాడ్ స్థలాన్ని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ మురళీ, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు పరిశీలించారు.

## రవన్న వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ

కల్లూరు, మార్చి5 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాయల సుబాష్ చంద్రబోస్ (రవన్న) 9 వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు వెంకన్న మాట్లాడుతూ.. ఈ నెల 9 వ తేదిన రాయల సుబాష్ చంద్రబోస్(రవన్న) తొమ్మిదవ వర్ధంతి ఖమ్మంలో రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరగనున్నదని చెప్పారు.

## క్రైస్తవ ఉపవాస దీక్షలు ప్రారంభం

కల్లూరు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ చర్చిలో బుధవారం క్రైస్తవ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షలు నేటితో 40 రోజుల పాటుగా అత్యంత భక్తిశ్రద్ధలతో యేసుక్రీస్తు నేర్పిన పశ్చాత్తాపము, ఉపవాసం, పరివర్తన, ప్రార్థన, త్యాగం, దానధర్మాలతో నూతన జీవితాన్ని హృదయ పరివర్తనతో ఈ దీక్షలను క్రైస్తవ భక్తులు కొనసాగిస్తారు. కల్లూరు, పెద్దకోరుకొండి, చెన్నూరు, లింగాల చర్చిల్లో క్రైస్తవ భక్తులు వేకువ జామునుంచే చర్చిలకు తరలి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కల్లూరు విచారణ గురువు సురేష్ మాట్లాడుతూ దేవుని ఆరాధించటం, ప్రేమ దయ, గుణాలతో మెలగాలని భక్తులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చర్చిల పరిధిలో గల సిస్టర్లు, మరియదళం కమిటీ సభ్యులు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## సమస్యలు పట్టకుంటే పోరాటాలు తప్పవు

ఎర్రుపాలెం, మార్చి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని రైతుసంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సాగు, తాగునీరు ఎద్దడిలేకుండా చూడాలన్నారు. ఎండిపోతున్నపంటలను కాపాడాలని కోరారు. రూ.2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేయాలని రైతు భరోసా వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నల్లబోతు హనుమంతరావు, సీఐటీయూ నాయకులు సగ్గుర్తి సంజీవరావు, వ్యవసాకార్మికసంఘం నాయకులు నాగులవంచ వెంకటరామయ్య, గామాసు జోగయ్య , దివ్వెల వీరాంజనేయులు,నాగుల్‌మీరా, వెంకటేవ్వర్లు పాల్గొన్నారు.

## రైతుల సంబరాలు

ఏన్కూరు, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు రాజీవ్ లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు బుధవారం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తూ ఏన్కూరు ప్రధానసెంటర్‌లో బాణసంచా కాల్చి సంబురాల నిర్వహించారు. 166మంది రైతులకుగాను రూ.30.8 కోట్లు నగదు ప్రభుత్వం జమచేసింది. ఎకరానికి రూ.21 లక్షల చొప్పునజమచేయడం జరిగింది. మెరుగైన ప్యాకేజీ కోసం విశేష కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మేడా ధర్మారావు, శోభన్ నాయక్, యండ్రాతి శ్రీనివాసరావు, వెనిగళ్ల శ్రీహరి, సాయిలి నాగయ్య, జాస్తి జనార్ధన్, మాదినేని లెనిన్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కారేపల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదు, చర్చిలలో నిర్వాహకులు తప్పినిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ ఎన్.రాజారామ్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు అది మరింత జఠిలమై శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు, చైర్మన్, కమిటీ సభ్యులు కలిసి తగిన సమయంలో సమావేశాలు ఏర్పాటుచేసుకుని తప్పనిసరిగా సీసీ కెమెరాల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు సీసీ కెమెరాల సాయంతో వాటిని ఛేదించవచ్చునని అన్నారు.